సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 14 । మార్చి । 2025



రైతులకు నాబార్డు చేయూత

గిరిజన రైతులకు నాబార్డు అండగా నిలుస్తోంది. ఆ సంస్థ ఇస్తున్న నిధులతో రైతులు స్వావలంబన సాధిస్తున్నారు. - 8లో



ఇసుక బజార్‌లు ఏర్పాటు

ఇసుక బజార్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీ సుశీల్‌కుమార్ అన్నారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-31 (శుక్రవారం సా॥)

సహర్ 5-02 (శనివారం ఉ॥)

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు ఎస్పీ హోలి శుభాకాంక్షలు



కె.నర్సింహ, ఎస్పీ

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా ప్రజలు ఎస్పీ నర్సింహ ఓ ప్రకటనలో హోలి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాదాలకు దూరంగా ఉంటూ అందరూ కలిసి మెలసి పండుగ జరుపుకోవాలని కోరారు. సంప్రదాయ రంగులు ఉపయోగించడం మంచిదని, ఎదుటివారికి ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు సేవలు వినియోగించుకోవాలని కోరారు. పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. మద్యం సేవించి, అతివేగంతో వాహనాలు నడపవద్దని, డీజేలు, బాణసంచా నిషేధమని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ఉత్సవం ముగించుకోవాలని కోరారు.

పారదర్శకతకే సామాజిక తనిఖీ



తిరుమలగిరిలో మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

తిరుమలగిరి: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పారదర్శకంగా అమలు చేసేందుకు సామాజిక తనిఖీ నిర్వహించి సమీక్షిస్తున్నట్లు జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష తెలిపారు. గురువారం తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 15వ విడత ప్రజా వేదికలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లకుండా నివారించి వారు నివసిస్తున్న గ్రామాల్లోనే పనులు కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ లచ్చిరాంనాయక్, విజిలెన్స్ అధికారి ఆశరాణి, ఎస్ఆర్‌పీ పాండురంగ, ఎంపీడీఓ లాజరస్, ఏపీఓ లక్ష్మి పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో విశేష పూజలు చేశారు. దానిలో భాగంగా సుప్రభాతసేవ, నిత్య హోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేపట్టారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కళ్యాణతంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం , మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామివారిని ఆలయ తిరుమాడ వీధుల్లో గరుడ వాహనంపై ఊరేగించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయా చార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేష గిరిరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం ఘనంగా నిర్వహించారు. వేకువజామును సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రధానాలయ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి వెండి జోడు సేవలను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

మూడేళ్లలో 329 మంది..

హెల్మెట్ ధరించకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్న యువత

- రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారులే అధికం
- ఫైన్ వేస్తున్నా మారని తీరు
- పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



సూర్యాపేట టౌన్: ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైతే ఎక్కువగా తలకు గాయాలై విగత జీవులుగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించి బైకులు నడపాలని పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తూ, జరిమానాలు విధిస్తున్నా వాహనదారుల తీరుమారడం లేదు. హెల్మెట్ లేకుండా నిర్లక్ష్యంగా బైకులు నడుపుతూ ప్రమాదాల్లో తలకు దెబ్బలు తగిలి ప్రాణాలు కోల్పోతున్నారు. మూడేళ్లలో బైకుల ప్రమాదాల్లో 329 మృత్యువాతపడ్డారు.

సూర్యాపట్టణానికి చెందిన ఓ వ్యక్తి వృత్తిరీత్యా కారు డ్రైవర్. ఫిబ్రవరి 27న రాత్రి తన కారును ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో పార్కింగ్ చేసి 60 ఫీట్ల రోడ్డులో గల తన ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తాళ్లగడ్డ సమీపంలో మరో ద్విచక్ర వాహనం అతివేగంతో వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న కారు డ్రైవర్ తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఢీ కొట్టిన వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. ఇద్దరికీ హెల్మెట్ లేకపోవడంతో ఒకరు మృతి చెందగా మరొకరు గాయాలపాలయ్యారు.

మూడేళ్లలో జరిగిన బైకు ప్రమాదాలు..

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు
2023	327	165
2024	320	151
2025	53	13

కచ్చితంగా హెల్మెట్ ధరించాలి

బైకు ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ శాతం హెల్మెట్ లేకపోవడంతోనే చనిపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు బైకుపై వెళ్లేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలి. యువత బైకుపై వెళ్లేటప్పుడు ర్యాష్ డ్రైవింగ్ చేయకుండా నిబంధనలు పాటించాలి. హెల్మెట్ లేకుండా బైకు నడిపితే ఫైన్ పడుతుంది.

– కె.నర్సింహ, ఎస్పీ, సూర్యాపేట జిల్లా

పోలీసులను చూసి..

రోడ్డు ప్రమాదాల్లో బైక్ ప్రమాదాలే ఎక్కువగా ఉంటున్నాయి. ఇందులో హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు తీవ్ర గాయాలై మృత్యువాత పడుతున్న వారే అధికంగా ఉంటున్నారు. అయితే హెల్మెట్ ధరిస్తే 70శాతం ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు. దీనిపై చాలా మందికి అవగాహన లేదు. ఒకవేళ హెల్మెట్ పెట్టుకున్నా దాని క్లిప్పులు సరిగా పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదం జరిగిన సమయంలో అకస్మాత్తుగా ఊడిపోయి తీవ్ర గాయాల పాలవుతున్నారు. కొందరు మాత్రం ట్రాఫిక్ చలానాలకు భయపడి పోలీసులను చూసి హెల్మెట్ ధరించడం వంటివి చేస్తున్నారు. ప్రతిఒక్కరూ ఇంటి నుంచి బైకుపై బయటకు వెళ్లేటప్పుడు విధిగా హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చు.

హెల్మెట్ ధరించకపోవడంతో..

మూడు సంవత్సరాల్లో జరిగిన బైకు ప్రమాదాల్లో జిల్లా వ్యాప్తంగా 329 మంది మృతి చెందారు. ఈ మూడేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులే ఎక్కువమంది మృతి చెందారు. ఇందులో 50శాతం మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే మృతి చెందారని పోలీసులు అధికారులు చెబుతున్నారు.

జగదీష్‌రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి



సూర్యాపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేటటౌన్ : శాసనసభలో రైతాంగ సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని బీఆర్ఎస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్‌చేయడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడారు. జగదీష్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీని వాస్‌గౌడ్, వై.వి, ఆకుల లవకుశ, జీడి భిక్షం పాల్గొన్నారు.

మండలిలో మనది అగ్రస్థానం

- శాసన మండలిలో ఉమ్మడి జిల్లాకు పెరిగిన ప్రాతినిధ్యం
- ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్సీలు.. తాజాగా మరో ముగ్గురు ఎన్నిక
- పుట్టిన స్థలం పరంగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌ది కూడా ఇక్కడే
- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: శాసన మండలిలో ఎమ్మెల్సీల సంఖ్యాపరంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అగ్రస్థానం దక్కింది. ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్సీలు ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఎమ్మెల్యే కోటాలో కాంగ్రెస్ నుంచి ఇద్దరు, సీపీఐ నుంచి ఒకరు ఎమ్మెల్సీలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరంతా ప్రత్యక్షంగా జిల్లా రాజకీయాల్లో ఉన్నవారే. ఇక బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన దాసోజు శ్రవణ్‌కు రాజకీయంగా నల్లగొండ జిల్లాతో పెద్దగా సంబంధం లేకపోయినా, పుట్టి పెరిగిందీ నల్లగొండ జిల్లా కేంద్రమే. దీంతో శాసన మండలిలో జిల్లాకు చెందిన ఎమ్మెల్సీల సంఖ్య ఏడుకు చేరుకుంది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలు గురువారం ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారు.

ఇదే మొదటిసారి..

ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 12 మంది ఎమ్మెల్యేలు ఉండగా.. శ్రావణ్ కాకుండా ఆరుగురు ఎమ్మెల్సీలు శాసన మండలిలో జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహించబోతున్నారు. ప్రస్తుతం శాసనమండలి చైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డి ఉండగా, పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న, స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మంకెన కోటిరెడ్డి ఉన్నారు. ఇప్పుడు కేతావత్ శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, నెల్లికంటి సత్యం, దాసోజు శ్రవణ్‌కుమార్ ఈ నెల 30న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలి పునరుద్ధరణ తర్వాత ఈ స్థాయిలో ప్రాతినిధ్యం దక్కడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న వారిలో గుత్తా సుఖేందర్‌రెడ్డి పదవీకాలం 2027 నవంబరు 21వ తేదీతో ముగియనుండగా, తీన్మార్ మల్లన్న పదవీకాలం అదే సంవత్సరం మార్చి 29వ తేదీతో ముగియనుంది. మంకెన కోటిరెడ్డి పదవీ కాలం 2028 జనవరి 4వ తేదీతో ముగియనుండగా, కేతావత్ శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, నెల్లికంటి సత్యం, దాసోజు శ్రవణ్‌కుమార్ పదవీ కాలం 2029 మార్చి 29వ తేదీన ముగియనుంది.

ఉద్యోగం.. ప్రజలకు సేవ చేసేలా ఉండాలి



గ్రూప్ - 2లో మంచి ర్యాంకులు సాధించిన అభ్యర్థులను అభినందిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : ఎంచుకున్న ఉద్యోగం ప్రజలకు సేవ చేసేలా ఉండాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. ప్రభుత్వం ఇటీవల వెల్లడించిన గ్రూప్ – 2 ఫలితాల్లో జిల్లా నుంచి ప్రతిభ కనబర్చి ఎంపికైన నలుగురు అభ్యర్థులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడారు. ఉద్యోగం ఆశయాలకు అనుగుణంగా ఉండాలన్నారు. ఎక్కడ నుంచి వచ్చామని కాకుండా ఏమి చేయాలనుకున్నామనేది ముఖ్య మని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం మహ్మదాపురం గ్రామం నుంచి గ్రూప్– 2 పరీక్షల్లో నాలుగో ర్యాంకు సాధించిన శ్రీరామ్ మధు, నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామం నుంచి 63వ ర్యాంకు సాధించిన మద్దిడి శ్యాంసుందర్ రెడ్డి, కోదాడ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన 293వ ర్యాంకు సాధించిన మాణిక్యం వేణు, మహ్మదాపురం గ్రామం నుంచి 326వ ర్యాంకు సాధించిన శ్రీరామ్ నవీన్ లతో వారి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ నలుగురు రైతు కుటుంబాలను నుంచి రావడం చాలా సంతోషకరంగా ఉందని, తమ తల్లిదండ్రుల కోర్కెలను నెరవేర్చిన వారయ్యారని కలెక్టర్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు, డీఆర్‌డీఓ వి.వి. అప్పారావు కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

భూగర్భ జలవనరులను పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో భూగర్భ జలవనరులు పెంచడానికి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో భూగర్భ జల కేంద్రబోర్డు నీటి పారుదల, వనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవ విభాగం జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో భూగర్భ జల అభివృద్ధి, నిర్వహణ విధానాలపై టైర్ – 3లో భాగంగా టీఏ, టీసీలకు భూగర్భజల కేంద్రబోర్డు ప్రాంతీయ సంచాలకుడు జి.కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భజలాల వనరులను పెంచడానికి, వాననీటిని సంరక్షించడానికి ఇంకుడు గుంతలు, చెక్‌డ్యామ్‌లు, రీచార్జి స్ట్రక్చర్స్ నిర్మించాలన్నారు. నరేగా కింద వాటర్ రీచార్జ్ స్ట్రక్చర్లు, ఇంకుడు గుంతలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలో కృష్ణా, మూసీ నదుల ప్రవాహం, నాగార్జున సాగర్, ఎస్సారెస్పీల ద్వారా సాగునీరు, తాగునీటి లభ్యత ఉన్నా గ్రౌండ్‌వాటర్ చాలా మండలాల్లో తగ్గిపోతోందని అన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని కొన్నిమండలాల్లో భూపొరల్లో మార్పులు, బండల కారణంగా నీరుభూమిలోకి ఇంకడం లేదన్నారు. అలాంటి చోట్ల వీలైనన్ని చెక్‌డ్యాంలు, రీచార్జి స్ట్రక్చర్లు కట్టుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సీనియర్ సైంటిస్టులు డాక్టర్ ఎస్ఎస్ విఠల్, టి.రాజబాబులు సూర్యాపేట జిల్లా ఆక్విఫర్ మ్యాపింగ్, నిర్వహణ ప్రణాళికలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీఓ వి.వి అప్పారావు, జిల్లా భూగర్భ జల అధికారి బాలు, భూగర్భ జల బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకారవేతనాల కోసం దరఖాస్తులు సమర్పించాలి

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల ప్రధానోపాధ్యాయులు 2017– 18 నుంచి 2024 – 25 విద్యా సంవత్సరానికి బీసీ, ఈబీసీ ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ మంజూరుకు పెండింగ్ లో ఉన్న హార్డ్ కాపీలను (దరఖాస్తు ఫారాలను) వెంటనే సమర్పించాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎల్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు 2024– 25 సంవత్సరానికి సంబంధించిన రెన్యువల్, కొత్త దరఖాస్తులను వెంటనే వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పిస్తే విద్యార్థులకు ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేస్తారని పేర్కొన్నారు. 2024– 25 విద్యా సంవత్సరంలో ఉపకార వేతనాలు కోసం దరఖాస్తు చేయని బీసీ, ఈ బీసీ విద్యార్థులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

19, 20 తేదీల్లో 'వికసిత్ భారత్'

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో ఈనెల 19, 20 తేదీల్లో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం జరగనుందని మహాత్మా గాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి, ప్రిన్సిపాల్ ఎస్.ఉపేందర్ తెలిపారు. గురువారం ఎన్జీ కళాశాలలో కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో హరికిషన్, వీరస్వామి, శేఖర్, స్వప్న, వెంకట్‌రెడ్డి, శిరాణి, సావిత్రి, మల్లేశం , కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత అయ్యేదాకా పోరు ఆగదు



నిరవధిక దీక్షలో మాట్లాడుతున్న మహాజన సోషలిస్టు పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు

సూర్యాపేట: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత అయ్యేంత వరకూ పోరాటం ఆగదని మహాజన సోషలిస్టు పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మార్చి 9 నుంచి సూర్యాపేటలో నిరవధిక దీక్షలు చేపట్టారు. 5వ రోజైన గురువారం నిర్వహించిన దీక్షల్లో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా జాప్యం చేస్తూ మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. దీక్షకు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టిపర్తి శ్రీకాంత్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గంట భిక్షపతి, పనికేర గణేష్, వల్దాసు నాగేంద్రబాబు, సిరపంగి లింగస్వామి, నాగార్జున, చింత మధు, పంతం లింగన్న, బీసీ నాయకులు పవన్ పాల్గొన్నారు.

సబ్‌జైలును సందర్శించిన డీఐజీ

భువనగిరిటౌన్ : జైళ్ల శాఖ డీఐజీ శ్రీనివాస్ గురువారం భువనగిరిలోని సబ్ జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. వంటలు రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకువచ్చేందుకు ప్రభుత్వం వివిధ రకాల పథకాలు తీసుకువస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంతోమంది క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జీవితాన్ని అంధకారం చేసుకుంటున్నారని, అటువంటి పరిస్థితుల నుంచి బయటపడేందుకు వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు రికార్డులను పరిశీలించారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం



సూర్యాపేటలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ ఆరోపించారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో సర్కారు వైఫల్యాన్ని నిరసిస్తూ గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించి అభివృద్ధి పర్చాలని, పెండింగ్ స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఏటా విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కినపల్లి వినయ్, దీపక్, నాని, వీరబాబు, అజయ్ గోపి, మేఘన, నవ్య, జ్యోతి, కావ్య పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్యానికి భరోసా

- ఎఫ్ఎస్‌హెచ్‌డబ్ల్యూ పేరుతో పోషకాహారంపై అవగాహన
- స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రత్యేకం
- గ్రామాల్లో కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు



మునగాలలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

స్వయం సహాయక సంఘాలు 17,669

సంఘ బంధాలు 579

సభ్యులు 1,84,281

తిరుమలగిరి (తుంగతుర్తి): మహిళల ఆరోగ్యానికి భరోసానిచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మహిళలకు పౌష్టికాహారం, ఆరోగ్యం , చేతుల శుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఫుడ్ సైన్స్ అండ్ హ్యూమన్ వెల్‌నెస్ (ఎఫ్ఎస్‌హెచ్‌డబ్ల్యూ) పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కొన్నిరోజులుగా జిల్లాలోని స్వయం సహాయక సంఘా(ఎస్‌హెచ్‌జీ)లలోని సభ్యులైన మహిళలకు పౌష్టికాహారం, ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహన ఎందుకంటే..

మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలంటే సంపూర్ణ ఆరోగ్యవంతులై ఉండాలి. అప్పుడే వారిలో పని సామర్థ్యం పెరిగి ఎంచుకున్న రంగాల్లో మెరుగైన ఉత్పత్తి సాధిస్తారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక మంది మహిళలు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరంతా ఆర్థికంగా ఎదగాలంటే మొదట పేదరికాన్ని జయించాలి. ఆరోగ్యంగా ఉంటేనే సంపద సృష్టి సాధ్యమవుతుంది. ఒకవేళ అనారోగ్యానికి గురైతే వైద్యానికే సంపాదనలో అగ్రభాగం ఖర్చవుతుంది. ఈ పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఆహారంతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పోషకాహార లోపాన్ని అధిగమించేలా..

గ్రామీణ ప్రాంతంలో ప్రతి పది మందిలో నలుగురు మహిళలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ కారణంగా తరచూ వారిని అనారోగ్యసమస్యలు బాధిస్తున్నాయి. ఈ పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం తయారీపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఈ సమావేశంలో పౌష్టికాహారం, ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను వివరిస్తున్నారు. దీంతో పాటు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యంపైనా అవగాహన పెంపొందిస్తున్నారు.

జాతీయజెండా రంగులే ఆహార ఎజెండా..

జాతీయజెండాలో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులు ఉన్నాయి. ఆయా వర్ణాలలోని ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా మహిళలు తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. దీంట్లో భాగంగా కాషాయం రంగులో ఉండే గుమ్మడి, బెల్లం, నారింజ, క్యారట్, పప్పు, బీట్ రూట్, దానిమ్మ తినాలి. అలాగే తెలుపు రంగులోని బియ్యం, జొన్నలు, సజ్జలు, అటుకులు, చిరుధాన్యాలు, కోడి గుడ్డు తినాల్సి ఉంది. ఇంకా ఆకు పచ్చ రంగులో లభించే కాయగూరలు, మునగ, కాకర, సోర మొదలైన వాటితో పాటు పప్పులు, కంది, వేరుశనగ, బాదం, జీడి పప్పు, శనగలు ఆహారంగా తీసుకోవాలి.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్.. వ్యక్తి మృతి


దుర్గాచారి (ఫైల్)

కోదాడరూరల్ : బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ మండల పరిధిలోని గుడిబండ శివారులో గురువారం జరిగింది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం శాంతినగర్‌కు చెందిన తల్లోజు దుర్గాచారి(29) కోదాడ పట్టణంలోని హిందూజా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా గురువారం బైక్‌పై కోదాడ నుంచి మేళ్లచెర్వు వెళ్తుండగా కోదాడ మండలం గుడిబండ గ్రామ శివారులో కాపుగల్లు క్రాస్‌రోడ్‌లో వేగంగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గాచారికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారులో నగదు చోరీ

నేరేడుచర్ల: కారులో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.2.50లక్షలు చోరీ చేశారు. ఈ సంఘటన గురువారం నేరేడుచర్లలో చోటు చేసుకుంది. పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో గల గంగోత్రి ఆస్పత్రి ఎండీ కనకపూడి మహేష్ తన కారును ఆస్పత్రి ఎదుట నిలిపాడు. బ్యాంకులో నగదు వేసేందుకుగాను కారులో రూ.3లక్షలు ఉన్న బ్యాగును ఉంచి ఆస్పత్రి లోపలికి వెళ్లాడు. తిరిగి మహేష్ వచ్చేసరికి బ్యాగులో రూ.50వేలు మాత్రమే ఉన్నాయి. మిగతా రూ.2.50లక్షలు చోరీకి గురయ్యాయి. దీంతో నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గిరిజన రైతులకు నాబార్డు చేయూత

- దేవరకొండ మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో డబ్ల్యూడీఎఫ్ నిధులతో భూ అభివృద్ధి పనులు
- ఏఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో రైతులకు స్ప్రింక్లర్లు, పైప్‌లు, డ్రిప్‌లు అందజేత
- ఉపాధికి బాటలు వేస్తున్న వాటర్‌షెడ్ కమిటీలు


వెంకట్‌తండాలో నాబార్డు సహకారంతో దొండ పందిరి ఏర్పాటు చేసిన రైతు

దేవరకొండ: నాబార్డు(నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) గిరిజన రైతులకు అండగా నిలుస్తోంది. నాబార్డు మంజూరు చేస్తున్న నిధులతో గిరిజన రైతులు జలసంరక్షణ పనులతో పాటు వివిధ రకాల పంటలు సాగు చేస్తూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. దేవరకొండ మండల పరిధిలోని ధర్మతండా, సపావట్ తండా, గొల్లపల్లి, వెంకట్‌తండాను ఐదేళ్ల కిత్రం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నాబార్డు డబ్ల్యూడీఎఫ్ (వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ ఫండ్) ఆయా గ్రామాల్లో భూ అభివృద్ధి పనులు చేపట్టింది. తద్వారా ఇక్కడ ఏర్పాటైన వాటర్‌షెడ్ కమిటీలు రైతుల కోసం వివిధ పనులకు సబ్సిడీలు మంజూరు చేస్తూనే తండాల వాసుల ఉపాధి కల్పనకు కూడా బాటలు వేశాయి.

నాలుగు గ్రామాల్లో చేపట్టిన పనులు..

- నాబార్డు ఎంపిక చేసిన ధర్మతండా, సపావట్‌తండా, గొల్లపల్లి, వెంకట్‌తండాల్లో అర్హులైన రైతుల పొలాల్లో మొదటగా లోతట్టు ప్రాంతాల్లో నీరు వృథాగా పోకుండా రాతి కట్టడం, ఫాంపాండ్స్, సంకెన్ పిట్స్, వరద కట్టల నిర్మాణాలు చేపట్టారు.
- నీటి నిల్వలు తగ్గకుండా చూడడం, బోరు రీచార్జ్ కావడం వంటి జలసంరక్షణ పనులు చేశారు.
- ఈ నాలుగు తండాల్లోని 1,100 హెక్టార్ల భూములకు సంబంధించి అర్హులైన రైతులను ఎంపిక చేసి నాబార్డు సహకారంతో యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ(ఏఆర్‌డీఎస్) ఆధ్వర్యంలో స్ప్రింక్లర్లు, పైపులు, డ్రిప్‌లు అందించారు.
- దొండ సాగుకు పందిళ్ల ఏర్పాటు, రైతుల పొలాలకు పైప్‌లైన్ వంటి పనులు చేపట్టి ప్రోత్సహించారు.
- నిధుల విషయంలో రైతుల వాటా 30శాతం ఉండగా నాబార్డు 70శాతం నిధులు మంజూరు చేసింది.
- మొత్తంగా ఐదేళ్లలో గిరిజన రైతుల పొలాల్లో అభివృద్ధి పనులకు నాబార్డు రూ.80లక్షలు మంజూరు చేసింది. దీంతో గిరిజనులు వివిధ పంటలతో పాటు కూరగాయల సాగు చేస్తూ కొంత మేర ఆర్థిక స్వావలంబన సాధించారు.

డ్రిప్ ద్వారా కూరగాయల సాగు



నాకున్న ఎకరం భూమిలో వ్యవసాయం చేస్తున్నాను. ఈసారి బోరులో నీరు తక్కువగా ఉండడంతో కేవలం 20గుంటల భూమిలో కూరగాయలు సాగు చేశాను. నాకు నాబార్డు ద్వారా ఎకరానికి సరిపడా డ్రిప్ ఇవ్వడం ద్వారా ప్రస్తుతం నాలుగు రకాల కూరగాయ పంటలు సాగు చేస్తున్నాను. నాబార్డు డ్రిప్ అందించడం ద్వారా కూరగాయల సాగు సులభతరమైంది.

– కృష్ణయ్య, రైతు, వెంకట్‌తండా

రైతులకు ఎంతో మేలు



నాబార్డు ద్వారా చేపట్టిన పనులు రైతులకు ఎంతో మేలు చేకూర్చాయి. గతంలో చేపట్టిన జలసంరక్షణ పనులతో ఇక్కడి రైతులు లబ్ధి పొందారు. ఇప్పటికే మొదటి విడుతలో చేపట్టిన పనులు సత్ఫలితాలిచ్చాయి. వాటర్‌షెడ్ కమిటీల ద్వారా ఎంపిక చేయబడిన రైతుల పొలాల్లో అభివృద్ధి పనులు చేపట్టాం. తద్వారా రైతులు తమ భూములు సాగుకు యోగ్యంగా మార్చుకుంటున్నారు.

– ఖాజా ఖైరత్‌అలీ, ఏఆర్‌డీఎస్ చైర్మన్

హోలి.. కావాలి ఆనందాల కేళి

- కళ్లలో, చర్మంపై రంగులు పడకుండా జాగ్రత్తలు వహించాలి
- రసాయనిక రంగులతో ఆరోగ్యానికి ముప్పంటున్న వైద్య నిపుణులు
- సహజమైన రంగులు వాడితే మేలు అని సూచన



రామగిరి(నల్లగొండ): హోలి పండుగ అనగానే అందరిలో ఉత్సాహం వస్తుంది. చిన్న నుంచి పెద్దల వరకు హుషారుగా రంగులు చల్లుకుంటారు. హోలి పండుగ రోజు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే విషాదాలకు తావులేకుండా ఆనందాలు నిండుతాయి. రసాయన రంగులతో చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ప్రకృతిలో లభించే పదార్థాలతో తయారుచేసిన రంగులను వినియోగించితే మంచి జరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రసాయనిక రంగుల్లో అల్యూమినియం బ్రొమైడ్, లెడ్ ఆక్సైడ్, మెర్క్యూరీ సల్ఫైడ్, కాపర్ సల్ఫైడ్ వంటివి ఉంటాయని, వీటి వల్ల శరీరానికి హాని కలుగుతుంది. ఒకవేళ కంట్లో పడితే చూపు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది.

సహజ రంగులతో మేలు...

ప్రకృతిలో లభించే పువ్వులు, ఆకులతో రంగులను తయారు చేసుకుంటే శరీరానికి ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా మోదుగు పువ్వు, గోగు పువ్వులను నీటిలో మరిగించడంతో రంగు ద్రావణంగా మారుతుంది. ఇలాంటివి చల్లుకుంటే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.

మాయిశ్చరైజర్ రుద్దుకోవాలి



హోలి ఆడటానికి ముందు చర్మానికి మాయిశ్చరైజర్ వాడాలి. తద్వారా రసాయన రంగులు శరీరానికి అంటుకోవు. చర్మం మొత్తం కప్పిఉండేలా దుస్తులు ధరించాలి. పెదవులు, కళ్ల చుట్టూ పెట్రోలియం జెల్లి రాసుకోవాలి. ఆర్గానిక్ రంగులు వాడితే ఉత్తమం. హోలి పూర్తయిన తర్వాత గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. చర్మంపై ఇరిటేషన్ అనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి.

– సీహెచ్. వెంకటకృష్ణ, చర్మవ్యాధి వైద్యుడు

జాగ్రత్తలు తప్పనిసరి



హోలి పండుగ రోజు రంగులు కంట్లో పడే ప్రమాదం ఉంటుంది. తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. కాంటాక్ట్ లెన్స్ వాడే వారు వాటిని తీసి హోలి ఆడాలి. కంట్లో రంగులు పడకుండా అద్దాలు వాడాలి. లూబ్రికేటింగ్ ఐ డ్రాప్స్ వాడాలి. ఒకవేళ కంట్లో రంగులు పడితే చల్లని నీటితో జాగ్రత్తగా శుభ్రం చేయాలి. కళ్లలో మంటగా అనిపిస్తే కంటి డాక్టర్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ తాటిపల్లి ప్రసూషరితేష్, కంటి వైద్యురాలు

350 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలో అక్రమంగా బ్లాసింగ్‌కు పాల్పడుతున్న ఓ వ్యక్తిని ఎస్‌ఓటీ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని అతడి నుంచి 350 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్నారనే సమాచారంతో బ్లాస్టింగ్ చేసే ప్రదేశంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆ వ్యక్తిని అప్పగించినట్లు ఎస్‌ఓటీ పోలీసులు వెల్లడించారు. ఈ విషయమై పట్టణ సీఐ రమేష్‌ను వివరణ అడగగా.. అక్రమ బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్వర్ణగిరీశుడికి తిరుప్పావడ సేవ


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: పట్టణంలోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం స్వామివారికి తిరుప్పావడ సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్య కల్యాణం, సాయంత్రం స్వామివారికి తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇసుక బజార్‌లు ఏర్పాటు

- రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీ సుశీల్‌కుమార్


వంగమర్తి వద్ద ఉన్న ప్రభుత్వ ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న టీజీఎండీసీ ఎండీ సుశీల్‌కుమార్

శాలిగౌరారం: ప్రజలకు నాణ్యమైన ఇసుకను సరసమైన ధరలకు అందించేందుకు మైనింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఇసుక బజార్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎంటీసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్‌కుమార్ అన్నారు. శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామ సమీపంలో మూసీ నది ఒడ్డున ఉన్న ప్రభుత్వ ఇసుక రీచ్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మూసీ నది నుంచి ఇసుక రవాణా, ఇసుక స్టాక్ పాయింట్, వేబ్రిడ్జిలను పరిశీలించారు. మూసీ ప్రాజెక్టులోని ఇసుకను నిర్ణీత సమయంలో వెలికితీసి స్టాక్ పాయింట్‌కు తరలించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు, ఇసుక బజార్‌లకు ఇసుక రవాణా చేసే వాహనాలు ఇసుక స్టాక్‌పాయింట్ వద్ద వేచిచూడకుండా త్వరితగతిన లోడింగ్ జరిగేలా యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత రీచ్ నిర్వాహకులకు సూచించారు. ఇసుక వాహనాలను తూకం వేసే వేబ్రిడ్జిని పరిశీలించారు. వేబ్రిడ్జిలో ఏర్పడిన రిపేర్లను తక్షణమే సరిచేసి ఇబ్బందులు తలెత్తకుండా చడాలని సిబ్బందికి సూచించారు. తూకం కోసం ఇసుక వాహనాలు వేచిచూడకుండా అదనంగా మరో వేబ్రిడ్జిని ఏర్పాటు చేయాలని సంబంధిత ఉన్నతాధికారులకు సూచించారు. ఇసుక వినియోగదారులకు తక్కువ ధరకు నాణ్యమైన ఇసుకను అందించేందుకు ప్రభుత్వం హైదరాబాద్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్, బౌరంపేట్, వట్టినాగులపల్లిలో ఇసుక స్టాక్‌పాయింట్‌లను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తుందన్నారు. ఆయా ఇసుక బజార్‌లను ఈ నెల 15న ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక బజార్‌లకు ఇసుకను తరలించి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇసుకను విక్రయించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మైనింగ్ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ జాకోబ్, అసిస్టెంట్ జియాలజిస్ట్ బాలు, సూపర్‌వైజర్ మహిపాల్ తదితరులు ఉన్నారు.

భూవివాదం కేసులో వ్యక్తికి జైలు, జరిమానా

భువనగిరి: భూ వివాదం కేసులో వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ భువనగిరిలోని అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పు వెల్లడించారు. భువనగిరి మండలంలోని బొల్లెపల్లి గ్రామానికి చెందిన జిట్టా శ్రీనివాస్‌రెడ్డికి అదే గ్రామానికి చెందిన వనం రమేష్, అతని సోదరుడు వనం సుమన్‌ల మధ్య భూ పంపకాల విషయంలో వివాదాలు నెలకొన్నాయి. ఈక్రమంలో వారు 2020 మే 18న శ్రీనివాస్‌రెడ్డిపై దాడికి పాల్పడారు. దీంతో ఆయన భువనగిరి రూరల్‌పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన అప్పటి ఎస్సై శంకరయ్య విచారణ చేసి కోర్టుకు పంపించారు. కేసు కోర్టులో విచారణలో ఉండగానే వనం సుమన్ 2022లో అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. గురువారం భువనగిరిలోని అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి విచారణ చేసి వనం రమేష్‌కు సంవత్సరం జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు భువనగిరి ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


సుజాత (ఫైల్)

మునుగోడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలం కచలాపురం గ్రామానికి చెందిన జంగ సుజాత(42) తల్లి చీకటిమామిడి గ్రామంలో ఉంటుంది. తన తల్లికి జ్వరం వస్తుండడంతో బుధవారం సుజాత తన కుమారుడితో కలిసి బైక్‌పై తల్లిని మునుగోడులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకుని తిరిగి చీకటిమామిడికి వెళ్తున్నారు. మార్గమధ్యలో మునుగోడు మండల కేంద్రం పరిధిలోని పత్తి మిల్లు వద్ద గేదెకు ఢీకొట్టి ముగ్గురు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో సుజాత తలకు తీవ్రంగా గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

లారీని ఢీకొట్టిన టిప్పర్.. డ్రైవర్‌కు గాయాలు

హుజూర్‌నగర్: ముందు వెళ్తున్న లారీని మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం హుజూర్‌నగర్ పట్టణంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు నుంచి హుజూర్‌నగర్ వైపు మట్టి లోడుతో వస్తున్న టిప్పర్ హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోకి రాగానే ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో టిప్పర్ డ్రైవర్ కొండా వర్మ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

గొర్రెల మంద పైకి దూసుకెళ్లిన లారీ

పాలకవీడు: వేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి గొర్రెల మంద పైకి దూసుకెళ్లడంతో 8 గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన గురువారం పాలకవీడు మండల కేంద్రం సమీపంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలం నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మలిగిరెడ్డి అంజిరెడ్డి గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే గురువారం కూడా గొర్రెలను మేపడానికి తోలుకెళ్తుండగా.. పాలకవీడు మండల కేంద్రం సమీపంలో లారీ అదుపుతప్పి గొర్రెల మంద పైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో 8 గొర్రెలు మృతిచెందాయి. మరికొన్ని గొర్రెలకు గాయాలయ్యాయి. సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

అనంతగిరి: మండల పరిధిలోని ఖానాపురం శివారులో పేకాట ఆడుతున్న వారిని అనంతగిరి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపురం గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఖానాపురం గ్రామానికి చెందిన ఐదుగురు పేకాట ఆడుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1430 నగదు, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

సూర్యాపేటటౌన్: అక్రమంగా డంప్ చేసిన ఇసుకను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ బాలునాయక్ తెలిపారు. గురువారం ఎస్సై బాలు నాయక్, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కేటీ అన్నారంలో తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు కేటీ అన్నారానికి చెందిన బైరెడ్డి చిన్నారెడ్డి నాలుగు ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక, కప్పల సంజీవకు చెందిన 26 ట్రాక్టర్ ట్రిప్పులు, కప్పల సైదులు ఆరు ట్రిప్పుల ఇసుక, నంద్యాల రాంరెడ్డికి చెందిన 8 ట్రిప్పుల ఇసుక, కప్పల గురుమూర్తి 2 ట్రిప్పుల ఇసుక, శరభ చారి 4 ట్రిప్పుల ఇసుక.. మొత్తం 50 ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

మిర్యాలగూడ టౌన్: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెం గ్రామానికి చెందిన మారేపల్లి సైదులు(60) బుధవారం మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్ సమీపంలో గల ఫంక్షన్‌హాల్‌లో తన బంధువుల వివాహానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జడ్చర్ల-కోదాడ హైవేపై రోడ్డు దాటుతుండగా తుంగపాడు నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న బైక్ సైదులును ఢీకొట్టింది. దీంతో అతడి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్ సాయంతో స్థానికులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమార్తె సట్టు నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఎక్కుతుండగా జారిపడిన ప్రయాణికుడు

- రక్షించిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది

భువనగిరి: రైలు ఎక్కే క్రమంలో జారిపడిన వ్యక్తిని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) సిబ్బంది రక్షించారు. ఈ ఘటన బుధవారం రాత్రి భువనగిరి రైల్వే స్టేషన్‌లో జరిగింది. భువనగిరి ఆర్‌పీఎఫ్ ఎస్ఐ కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బాజిరెడ్డి జగదీష్ అనే ప్రయాణికుడు నిజామాబాద్‌కు వెళ్లేందుకు బుధవారం రాత్రి భువనగిరి రైల్వే స్టేషన్‌లో టికెట్ తీసుకున్నాడు. రాత్రి 8.22 గంటలకు తిరుపతి నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలు భువనగిరికి చేరుకుంది. రాత్రి 8.23 గంటలకు స్టేషన్ నుంచి రైలు కదలగా.. జగదీష్ రైలు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో జారిపడ్డాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ బాలాజీ గమనించి జగదీష్‌ను బయటకు లాగాడు. దీంతో అతడికి ఎటువంటి గాయాలు కాలేదు.

బైక్ చోరీ కేసులో జైలు శిక్ష

చివ్వెంల (సూర్యాపేట): బైక్ చోరీ కేసులో వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత గురువారం తీర్పు వెల్లడించారు. సూర్యాపేటకు చెందిన చౌడం పవన్ కుమార్ గత సంవత్సరం ఫిబ్రవరి 29న పట్టణంలోని విద్యానగర్‌లో తన ఇంటి ఎదుట రాత్రి సమయంలో బైక్‌ను పార్క్ చేశాడు. తెల్లవారుజామున లేచి చూసేవరకు బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ మహేంద్రనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అపహరణకు పాల్పడిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నెల్లూరు సీతారాములు జిల్లా, యాటపాక మండలం బుట్టయ్య గూడెం గ్రామానికి చెందిన వాసం మనోహర్‌గా గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ హేమలత నాయుడు వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి 7 నెలల 27 రోజులు జైలు శిక్ష విధించారు. పీపీకి కోర్టు కానిస్టేబుల్ సీహెచ్, రవికుమార్ సహకరించారు.

ఖేలో ఇండియా పోటీలకు అవకాశం కల్పించాలి


స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్‌కు మొక్క అందజేస్తున్న ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఖేలో ఇండియా, జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అవకాశం కల్పించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలదేవికి ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ హరీష్‌కుమార్ నేతృత్వంలో వినతి పత్రం అందజేశారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో క్రీడా ప్రాంగణాలను జాతీయ స్థాయి ప్రమాణాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేసినట్లు వివరించారు. క్రీడా ప్రాంగణాల ప్రత్యక్ష పరిశీలన కోసం ఎంజీ యూనివర్సిటీని సందర్శించాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట స్పోర్ట్స్ బోర్డ్ సభ్యులు ప్రొఫెసర్ సోమలింగం, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రమావత్ మురళి తదితరులు ఉన్నారు.

భూసారాన్ని కాపాడుకుంటేనే అధిక దిగుబడులు

- కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు
- కేవీకేలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు కిసాన్ మేళా



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

త్రిపురారం: పంటల సాగులో విచ్చలవిడిగా రసాయన మందులు వాడుతుండడంతో భూసారం దెబ్బతింటుందని, భూసారాన్ని కాపాడుకుంటేనే అధిక దిగుబడులతో సాధించవచ్చని త్రిపురారం మండంలోని కంపాసాగర్‌లో గల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం కంపాసాగర్ కేవీకేలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైతులకు కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహించారు. వరితో పాటు వివిధ రకాల పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు కేవీకే శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. భూమిలోని పోషకాలు మొక్కలకు సమపాలల్లో అందాలంటే సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలన్నారు. చీడపీడల నివారణకు అన్నిరకాల మందులను కలిపి పిచికారీ చేయడం వల్ల పంట నష్టపోవాల్సి వస్తుందన్నారు. వరి పొలంలో యూరియాతో పాటు పొటాష్ వేసుకోవడం వల్ల చీడపీడలను తట్టుకునే శక్తి పెరుతుతుందన్నారు. ప్రస్తుతం వరి పైరులో అగ్గితెగులు, కాండం కుళ్లు తెగులు, సుడిదోమను గమనించామని శాస్త్రవేత్తల సలహాలతో పురుగు మందులు సకాలంలో పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త లింగయ్య, సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్, సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ, యంగ్ ప్రొఫెషనల్స్, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

46 కిలోల గంజాయి పట్టివేత

- పారిపోయిన నిందితుడు
- కారు స్వాధీనం

చౌటుప్పల్: అక్రమంగా తరలిస్తున్న 46 కిలోల గంజాయిని చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ ఏజెన్సీ నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరుకు కారులో గంజాయి తరలిస్తున్నట్లు రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి చౌటుప్పల్‌కు వచ్చిన ఎస్‌ఓటి పోలీసులు విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై కాపుకాశారు. చౌటుప్పల్ పట్టణంలోని రిలయన్స్ ట్రెండ్స్ షోరూమ్ ఎదురుగా హైదరాబాద్ మార్గంలో అనుమానాస్పదంగావెళ్తున్న కారును గుర్తించి పోలీసులు ఆపారు. కారు నడుపుతున్న వ్యక్తిని పోలీసులు ప్రశ్నిస్తుండగానే అతడు కారు అక్కడే వదిలేసి తప్పించుకొని పారిపోయాడు. కారులో తనిఖీ చేయగా 46 కిలోల గంజాయి లభించింది. పట్టుబడిన కారు, గంజాయిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితుడు పట్టుబడిన తర్వాత పూర్తివివరాలు తెలుస్తాయని సీఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.